క్లుప్తంగా

ఖానాపురం అలుగువాగు పరిశీలన

ఖమ్మంఅర్బన్: ఖమ్మంలోని ఖానాపురం అలుగువాగును సోమవారం జలవనరుల శాఖ ఇంజనీర్లు పరిశీలించారు. ఇటీవల భారీ వర్షాలతో అలుగువాగు పొంగి సమీప కాలనీలను ముంచెత్తింది. దీంతో వాగుకు ఇరువైపులా సుమారు 200 మీటర్ల మేర పొడవు, ఏడు మీటర్ల మేర ఎత్తుతో వాల్స్ నిర్మాణం చేపట్టి శ్లాబ్ వేసేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి తుమ్మల ఆదేశించారు. దీంతో బైపాస్ రోడ్డు పక్కన ఇటీవల నిర్మించిన అయ్యప్పస్వామి గుడి ఎదురుగా ఇరువైపులా వాల్స్, శ్లాబ్ నిర్మాణానికి ఈఈ అనన్య, డీఈ ఉదయ్‌ప్రతాప్ పరిశీలించి వివరాలు ఆరాతీశారు. ప్రతిపాదిత పనులకు రూ.2 కోట్లకు పైగా వ్యయం అవుతుందని అంచనా. నాయకులు చావా నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం నగరంలోని 33/11 కేవీ రామాలయం సబ్‌స్టేషన్ 11 కేవీ ఖిల్లాబజార్ ఫీడర్ నిర్వహణ పనుల కారణంగా మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని టౌన్-5 ఏఈ ఆపరేషన్స్ జె.ప్రభాకర్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో కస్బాబజార్, షాదీఖానా, పాత మున్సిపాలిటీ ప్రాంతం, ఖిల్లా ప్రాంతం, శుక్రవారపుపేట, తబేలా మసీద్ ఏరియా, బ్రాహ్మణబజార్, రిక్కాబజార్, చర్చికాంపౌండ్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

లారీడ్రైవర్‌పై కేసు

కామేపల్లి: మండలంలోని పండితాపురం స్టేజీ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదానికి కారకుడైన డ్రైవర్‌పై కేసు నమోదైంది. లారీని అతివేగంగా, అజాగ్రత్తగా నడిపి బైక్‌ను ఢీకొట్టిన ఘటనపై బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సోమవారం ఎస్‌ఐ సాయికుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కబ్జాకు గురైన కాల్వలను కాపాడాలని వినతి

ఖమ్మంరూరల్: మండలంలోని ఏదులాపురం పరిధిలోని వరంగల్‌క్రాస్‌రోడ్‌లో కబ్జాకు గురైన కాల్వలను కాపాడాలని కోరుతూ రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి యూత్ కాంగ్రెస్ పాలేరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ భూక్యా సురేశ్ నాయక్ సోమవారం వినతిపత్రం సమర్పించారు. 33 అడుగులున్న సాగర్ పంట కాల్వను కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించడంతో ఇటీవల వచ్చిన వరదలతో ఆ ప్రాంతంలోని ఇళ్లన్నీ నీట మునిగాయని, అందుకు కారణం పంట కాల్వ ఆక్రమణకు గురై వెడల్పు తగ్గడమేనని మంత్రికి విన్నవించారు.

యువత చెడు మార్గంలో నడవొద్దు..

ఖమ్మంస్పోర్ట్స్: యువత చెడు మార్గంలో నడవొద్దని, క్రీడలపై ఆసక్తి పెంచుకుని ఉన్నతంగా ఎదగాలని సంతోష్ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు కన్న ప్రసన్నకృష్ణ అన్నారు. సోమవారం నగరంలో ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల మైదానంలో జరుగుతున్న జిల్లాస్థాయి క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో బలుసు మురళీకృష్ణ, కృష్ణచైతన్య, సాయికృష్ణ, గోపి పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	దేవర
వినోద	దేవర
సాయిరాం	స్వాగ్
ఆదిత్య	జోకర్, దక్షిణ రాంగనర్ బన్నీ
శ్రీనివాస	సత్యం సుందరం
సుందర్	---------------

- ఖమ్మంవ్యవసాయం

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	76	బచ్చలికూర	3
వంకాయ	56		20
బెండకాయ	36	పాలకూర	3
పచ్చిమిర్చి	30		20
కాకర	36	చుక్కకూర	3
బోడ కాకర	120		20
బీర	50	తోటకూర	3
దొండ	54		20
పొట్లకాయ	60	గోంగూర	5
చిక్కుడు	66		20
గోరుచిక్కుడు	48	మెంతికూర	2
క్యాబేజీ	30		20
క్యాలీఫ్లవర్	35	కొత్తిమీర	1
ఆలుగడ్డ	36		50
చామగడ్డ	54	పుదీన	1
క్యారెట్	54		25
క్యాప్సికం	74	-ఖమ్మం వ్యవసాయం	

రాత్రికి రాత్రే నిర్మాణాలు



అనుమతులు లేకుండా నిర్మించారనే కారణంలో పనులు నిలిపివేసిన భవనం

- నిద్రావస్థలో కేఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగం
- ఫిర్యాదులు అందితేనే సరి.. లేకుంటే పట్టించుకోని వైనం
- అనుమతి లేదని తెలిసినా నిర్మాణాలను అడ్డుకోవడంలో నిర్లక్ష్యం
- రాజకీయ పలుకుబడితో చెలరేగిపోతున్న ఆక్రమణదారులు..?



రోడ్డును ఆక్రమిస్తూ చేపట్టిన అదనపు నిర్మాణంపై రేకులు మాత్రమే తొలగించిన దృశ్యం

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మంలో వాణిజ్య, వ్యాపారాలతో పాటు నివాసం ఉండేందుకు వలస వస్తున్న వారి సంఖ్య భారీగా పెరుగుతోంది. ఓ పక్క అభివృద్ధి, మరో పక్క అవసరాల కోసం నగరంలో స్థిరపడే వారి సంఖ్య పెరుగుతుండటంతో నగరంతో పాటు నగర చుట్టు పక్కల భూముల ధరలు పెద్ద మొత్తంలో పెరిగాయి. భూముల ధరలు పెరగడంతో ఆక్రమణదారులు ఖాళీ స్థలాలపై కన్నేయడం, వారి స్థలాల పక్కన ఉన్న స్థలాల్లోకి వెళ్లి నిర్మాణాలు చేపట్టడం వంటివి చేస్తున్నారు. ఇక అనుమతులు లేకుండానే భవన నిర్మాణాలను చేపడుతూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. అనుమతులు లేకుండా రాత్రికిరాత్రి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదు. అనుమతులు లేకుండా నిర్మాణాలు జరుగుతుంటే ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ అధికారులు నిద్రావస్థలో ఉంటున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

నామమాత్రంగా నోటీసులు..

అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే సదరు నిర్మాణదారుడికి మున్సిపల్ చట్టం ప్రకారం నోటీసులు ఇచ్చి నిర్మాణాన్ని నిలిపివేయాల్సి ఉంటుంది. నోటీసులు ఇచ్చిన తర్వాత కూడా నిర్మాణాలు కొనసాగిస్తే వాటిని తొలగించి, మున్సిపల్ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. అయితే ఖమ్మం నగరంలో మాత్రం ఇందుకు విరుద్ధంగా జరుగుతుందన్న ఆరోపణలు ఉన్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండా భవన నిర్మాణాలు చేపట్టినా అధికారులు కనీసం అటువైపు కన్నెత్తి కూడా చూడరు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే తూతూ మంత్రంగా నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటారు. ఇక అక్రమ నిర్మాణాలు రాత్రికిరాత్రే పూర్తవుతాయి. టౌన్ ప్లానింగ్ విభాగం అధికారుల తీరుతో అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి.

అక్రమ నిర్మాణాల్లో రాజకీయ పలుకుబడి..

నగరంలో జరుగుతున్న పలు అక్రమ నిర్మాణాలకు రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు వంతపాడుతున్నట్లు తెలుస్తోంది. బైపాస్ రోడ్డు వెంట ఎలాంటి సెట్‌బ్యాక్ లేకుండా నిర్మించిన భవనాల యజమానులకు మద్దతుగా నిలబడుతున్నట్లు సమాచారం. దీంతోనే ఇటీవల కాలంలో అనేక భవనాలు సెట్‌బ్యాక్ లేకుండానే నిర్మాణం పూర్తి చేశారనే విమర్శలు ఉన్నాయి. అధికారులు కూడా తమకు వచ్చే కమీషన్లపైనే దృష్టి సారిస్తున్నారనే చర్చ కేఎంసీలో సాగుతోంది. అనుమతులు, సెట్‌బ్యాక్ లేకుండా జరుగుతున్న నిర్మాణాలపై ఫిర్యాదులు అందిస్తే అధికారులు చర్యలకు పాల్పడకుండా తాత్సారం చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

తర్వాత చూస్తాం..

అక్రమ నిర్మాణాలపై టౌన్ ప్లానింగ్ అధికారులను వివరణ కోరగా దాటవేత ధోరణిలో సమాధానం చెప్పడం గమనార్హం. ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వేలో తామంతా బిజీగా ఉన్నామని, కార్యాలయం వైపు కూడా రావడం లేదని తెలిపారు. సర్వే పూర్తయ్యాకే కార్యాలయానికి సంబంధించిన పనులు చక్కబెడతామంటూ సెలవిచ్చారు.

➡ ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం నుంచి భవన నిర్మాణానికి ఎలాంటి అనుమతులు లేకుండానే నగరంలోని 50వ డివిజన్‌లో ఇంటి నిర్మాణం చేపట్టారు. రాత్రి వేళల్లో పనులు జరిపిస్తూ, కొద్ది రోజుల్లోనే ఇంటి పిల్లర్లను నిర్మించి, స్లాబులు వేసేందుకు సెంట్రింగ్‌ను ఏర్పాటు చేశారు. రాత్రి వేళ పనులు చేస్తుండటంపై స్థానికులకు అనుమానం వచ్చి.. అధికారులకు ఫిర్యాదు చేశారు. భవన నిర్మాణానికి అనుమతులు లేవంటూ అధికారులు నిర్మాణ పనులను అడ్డుకున్నారు. అధికారులు పనులను అడ్డుకోవడంతో భవన యజమాని అనుమతుల కోసం దరఖాస్తు చేసుకునన్నట్లు తెలిసింది. అనుమతులు లేకుండా స్లాబు లెవెల్ వరకు నిర్మాణం చేపట్టినప్పటికీ అధికారులు ఎందుకు నోరు మెదపకుండా ఉన్నారని, ఫిర్యాదు వస్తేనే పట్టించుకుంటారా? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

➡ బైపాస్ రోడ్డుకు ఆనుకుని ఆర్‌ఆర్ స్కూల్ పక్కన ఓ రెస్టారెంట్ నడుపుతున్నారు. సదరు నిర్వాహకులు అనుమతి లేకుండానే రోడ్డు మీదకు అదనపు నిర్మాణాలు చేపట్టగా ఆ ప్రాంత వాసులు స్థల యజమానిని హెచ్చరించినట్లు సమాచారం. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని తెలిసింది. ప్రధాన రహదారి వెంట.. అంతర్గత రోడ్డు మీదకు నిర్మాణం చేపట్టినా అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలొస్తున్నాయి. అక్రమ నిర్మాణం చేపట్టడానికి ఆ వ్యాపారి వెనుక ఎవరున్నారన్నది చర్చనీయాంశంగా మారింది. అయితే, నానాటికీ ఫిర్యాదులు పెరుగుతుండడంతో అదనపు నిర్మాణం షెడ్‌పై రేకులు మాత్రం తొలగించినా మిగతావి అలాగే ఉంచడం గమనార్హం.

సమస్య వెంటనే పరిష్కారమవ్వాలి..



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మంమయూరిసెంటర్: గ్రీవెన్స్‌కు వచ్చిన ప్రతి సమస్యను పరిశీలించి వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశించారు. సోమవారం కేఎంసీలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి ఫిర్యాదులను కమిషనర్ అభిషేక్ అగస్త్య స్వీకరించి, మాట్లాడారు. గ్రీవెన్స్‌కు వచ్చిన సమస్యల్లో సత్వరమే పరిష్కరించదగినవి పరిశీలించి అక్కడికక్కడే పరిష్కరించాలన్నారు. పేర్ల మార్పు, పన్నుల రివిజన్ తదితర సమస్యల కోసం ప్రజలు పదేపదే కేఎంసీ చుట్టూ ప్రదక్షిణలు చేయకుండా చూడాని పేర్కొన్నారు. ప్రజావాణి నిర్వహించి ప్రతి సోమవారం కేఎంసీ కార్యాలయంలో ఐదు కౌంటర్లను ఏర్పాటు చేయాలని, ఆయా కౌంటర్లలో రెవెన్యూ, టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్, పెన్షన్, డెత్ అండ్ బర్త్ విభాగాలకు చెందిన కంప్యూటర్ ఆపరేటర్లను ఏర్పాటు చేయాలని, అక్కడే సమస్యల పరిష్కారం కోసం చర్యలు ప్రారంభించాలని చెప్పారు. కాగా, కేఎంసీలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు ప్రధాన విభాగాలైన ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులు హాజరు కాకపోవడం పట్ల కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రీవెన్స్‌కు హాజరు కాని ఈఈ, డీసీపీ, ఏసీపీలకు ప్రజావాణి షోకాజ్ నోటీసులు ఇవ్వాలని అసిస్టెంట్ కమిషనర్‌ను ఆదేశించారు. ఇక గ్రీవెన్స్‌కు 12 గంటల సమయంలో హాజరైన మెప్మా అధికారిణిని కమిషనర్ మందలించారు. అధికారులు గ్రీవెన్స్‌కు సమయపాలన పాటించాలని ఆదేశించారు.

ఇజ్రాయిల్ మారణకాండపై నిరసన



నిరసన తెలుపుతున్న నాయకులు

రఘునాథపాలెం: ఇజ్రాయిల్ మారణకాండకు అక్టోబర్ 7 నాటికి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని వామపక్ష పార్టీలు ఇచ్చిన పిలుపుమేరకు సోమవారం రఘునాథపాలెం మండలం రాంక్యాతండాలో సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ డివిజన్ నాయకుడు ధరావత్ లక్ష్మణ్ మాట్లాడారు. సామ్రాజ్యవాద అమెరికా అండదండలతో ఇజ్రాయిల్ చేస్తున్న దురాక్రమణ పూరిత యుద్ధ దాడులతో పాలస్తీనా అతలాకుతలం అవుతోందని, ఉద్దేశపూర్వకంగానే పాఠశాలలు, ఆస్పత్రులు, మసీదులే లక్ష్యంగా ఇజ్రాయిల్ దాడులకు పాల్పడిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాపారావు, జాటోత్ ప్రేమ్‌సింగ్, ఇస్లావత్ రమేశ్, కేలోత్ వెంకన్న, భూక్య రవి తదితరులు పాల్గొన్నారు.

దుర్గామాతకు విశేష పూజలు



కామేపల్లి: కుంకుమపూజలో పాల్గొన్న మహిళలు



ఖమ్మంమామిళ్లగూడెం: అన్నదానాన్ని ప్రారంభిస్తున్న మేయర్ పునుకొల్లు నీరజ

కామేపల్లి: దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కెప్టెన్ బంజర గ్రామంలో సోమవారం దుర్గామాతకు పూజలు నిర్వహించారు. అర్చకులు శ్రీనివాస శర్మ, బత్వాజాశర్మ ఆధ్వర్యాన కుంకుమపూజ నిర్వహించగా అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గుంపెనపల్లి అనంతరాములు, రంగారావు, ఈసం చింతరామనర్సయ్య, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మీనాక్షీదేవిగా..

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం నగరంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఐదో రోజు మీనాక్షీదేవి అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజలు చేశారు.

28వ డివిజన్‌లో అన్నదానం

ఖమ్మంమామిళ్లగూడెం: దేవీ నవరాత్రోత్సవాల సందర్భంగా ఖమ్మంలోని 28వ డివిజన్‌లో శ్రీకనకదుర్గ ఉత్సవ కమిటీ మూడో వార్షికోత్సవం సందర్భంగా బాలు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ చెరుకుపల్లి బాలు ఆధ్వర్యంలో సోమవారం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమానికి నగర మేయర్ పునుకొల్లు నీరజ, కుక్కల ప్రవళిక, పత్తికొండ శ్రీను, సుంకేసుల రామలక్ష్మమ్మ, సీహెచ్ సిద్దులు, అలేఖ్య, కాశమ్మ, ప్రమీల, జి.నాగలక్ష్మి, చెరుకుపల్లి శ్రీను, సుంకేసుల సింధు, వడ్లమూడి రాజేశ్, మనోజ్, సాయి, తరుణ్, పవన్, అఖిల్, మణికంఠ, రేణుక పాల్గొన్నారు.

ఖమ్మంవైద్యవిభాగం: నగరంలోని 28వ డివిజన్‌లో సోమవారం అన్నదానం నిర్వహించారు. శ్రీ విజయ దుర్గాదేవి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో దాతలు తొగరు శ్రీనివాసరావు, నాగమణి సహకారంతో నిర్వహించిన కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ప్రజల విశ్వాసాన్ని పొందాం..



కేక్ కట్ చేస్తున్న కుంచపు రాంబాబు

ఖమ్మంఅర్బన్: స్వయం కృషితో రియల్ ఎస్టేట్ రంగంలో అడుగుపెట్టి, వినియోగదారుల విశ్వాసాన్ని పొందామని శ్రీ జయవిలాసిని డెవలపర్స్, కన్‌స్ట్రక్షన్స్ చైర్మన్, ఎండీ డాక్టర్ కుంచపు రాంబాబు పేర్కొన్నారు. ఆయన జన్మదిన వేడుకలు సోమవారం నగరంలోని ఓ ఫంక్షన్‌హాల్లో నిర్వహించారు. ఆయన కేక్ కట్ చేసి మాట్లాడారు. హైదరాబాద్, ఖమ్మం నగరాల్లో వెంచర్లు వేసి, పలువురికి ఉపాధి చూపించామని, కొనుగోలుదారులకు లాభం చేకూరేలా వ్యాపారం చేశామని చెప్పారు. కార్యక్రమంలో కంపెనీ ఉద్యోగులు, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, నున్నా రమణ, ఎండీ జానీమియా, డాక్టర్ సైదులు, ఉడుగు రమేశ్, కొండయ్య, సునీల్, విజయేందర్, రామారావు, రవి, కిట్టు, రామ్మూర్తి, ఖాజామియా, శంకర్, సురేందర్, కుంచపు విజయ తదితరులు పాల్గొన్నారు.

మగువ షార్ట్ ఫిలింకు జ్యూరీ అవార్డు

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం నగరానికి చెందిన షేక్ లాల్‌జాన్‌పాషా నిర్మించి, నటించిన మగువ షార్ట్ ఫిలింకు జ్యూరీ అవార్డు లభించింది. ఆదివారం రాత్రి విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో విజయవాడ తెలుగు షార్ట్ ఫిలిం అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో లాల్‌జాన్‌పాషాకు సినీనటుడు అజయ్ ఘోష్ అవార్డు అందించారు. తెలుగు రాష్ట్రాల నుంచి మొత్తం 106 చిత్రాలకుగాను 17 చిత్రాలకు అవార్డులు దక్కాయి. మగువ షార్ట్ ఫిలింకు దర్శకుడు బండి శివ, కెమెరా, ఎడిటింగ్ ఆసిఫ్ చార్లీ, నటీమణిగా ఉమారాణి వ్యవహరించారు.



అవార్డు అందుకుంటున్న లాల్‌జాన్‌పాషా

సీపీఐ సీనియర్ నాయకుడు మృతి

ఖమ్మంరూరల్: మండలంలోని మద్దివారిగూడెంనకు చెందిన సీపీఐ సీనియర్ నాయకుడు బండి రామయ్య (96) అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ ఎండీ మౌలానా రామయ్య మృతదేహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చివరి వరకు రామయ్య ప్రజా సమస్యలపై పోరాటం చేశారని తెలిపారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. నివాళులర్పించిన వారిలో సీపీఐ మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, నాయకులు సేవ్యా, ఆర్.వెంకన్న, ఎ.ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైస్ మిల్లర్లపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న చెరుకుపల్లి నాగేశ్వరరావు

ఖమ్మంమామిళ్లగూడెం: ప్రభుత్వ ధనాన్ని దోచుకుంటున్న రైస్ మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని బీఎస్పీ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. సోమవారం ఖమ్మంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు చెరుకుపల్లి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. పౌరసరఫరాల శాఖ అధికారుల అండదండలతో సీఎంఆర్ ప్యాడీ స్కీమ్‌లో ఖమ్మం జిల్లా రైస్ మిల్లర్లు చేసిన భారీ అవినీతిని ప్రభుత్వం వెలికి తీయాలని డిమాండ్ చేశారు. రెండేళ్లుగా ప్రభుత్వానికి బియ్యం అప్పగించకుండా అక్రమంగా ఇతర రాష్ట్రాలకు తరలించి సుమారు రూ.300 కోట్లు అవినీతికి పాలుపడ్డారని ఆరోపించారు. సమావేశంలో ఉపేంద్ర సాహు, నాగరాజు, విజయ్‌కుమార్, రాజశేఖర్ తదతరులు పాల్గొన్నారు.

22 ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

నేలకొండపల్లి: మండలంలో ధాన్యం కొనుగోళ్లకు 22 కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు ఏఓ డి.అరుణకుమారి తెలిపారు. మండల కేంద్రంలో సోమవారం ఆమె మాట్లాడారు. ఐకేపీ ఆధ్వర్యాన ఒకటి, పీఏఎస్‌ఎస్‌ల ఆధ్వర్యంలో 14, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏడు కేంద్రాలు ఏర్పాటు చేయనుండగా, కొత్తగా గువ్వలగూడెం, అనాసాగారంలో ఏర్పాటుకు ప్రతిపాదనలు రూపొందించామని పేర్కొన్నారు. అనాసాగారంలో దొడ్డు రకం ధాన్యం కొనుగోలు చేసేందుకు కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మండలంలో 26,900 ఎకరాల్లో వరిసాగు కాగా, 61,160 టన్నుల దిగుబడిలో కొనుగోలు కేంద్రాలకు 24,471 టన్నుల ధాన్యం వస్తుందని అంచనా ఉన్నట్లు వెల్లడించారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏఓ వెంట ఏఈఓ అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ బలోపేతానికి కార్యాచరణ

నేలకొండపల్లి: మత్స్య సొసైటీని మరింత బలోపేతం చేసేందుకు కార్యాచరణ రూపొందించినట్లు చెరువుమాధారం మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు ఖాసీం తెలిపారు. సొసైటీ పాలకవర్గం సర్వసభ్య సమావేశం సోమవారం జరగగా ఆయన మాట్లాడారు. ఉపాధ్యక్షుడు ధీరావత్ రాధాకృష్ణమూర్తి, డైరెక్టర్లు బలరాం, శేషయ్య, వెంకట్రాం తదితరులు పాల్గొన్నారు.

వాసవి సేవా సమితి జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాస్

నేలకొండపల్లి: వాసవి సేవా సమితి ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా నేలకొండపల్లికి చెందిన పసుమర్తి శ్రీనివాస్‌ను నియమిస్తూ జాతీయ అధ్యక్షుడు పి.సురేశ్ ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం వివరాలను శ్రీనివాస్ విలేకరులకు వెల్లడించారు.

హాస్టల్‌ను కొనసాగించాలి

తిరుమలాయపాలెం: మండలంలోని సుబ్లేడులోని ఎస్టీ హాస్టల్‌ను తిరుమలాయపాలెం మండల కేంద్రంలో నడుపుతున్నారని, కానీ, సుబ్లేడులోనే కొనసాగించాలని కోరుతూ సోమవారం తహసీల్దార్ పీవీ రామకృష్ణకు గ్రామస్తులు వినతిపత్రం అందించారు. హాస్టల్‌ను తిరుమలాయపాలేనికి తరలించడం వల్ల సుబ్లేడు పరిసర ప్రాంతాలకు చెందిన గిరిజన విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. మండడి ఇజ్రాయిల్, దయాకర్, వీరస్వామి, దేవయ్య, బాబు, మల్లయ్య పాల్గొన్నారు.

పంప్ ఆపరేటర్లకు ముగిసిన శిక్షణ

నేలకొండపల్లి: గ్రామాల్లో తాగునీటి సరఫరా విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందికి నాలుగు రోజులుగా ఇస్తున్న శిక్షణ సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా మిషన్ భగీరథ ఎస్‌ఈ, ఈఈ, డీఈఈలు సూచనలు ఇవ్వగా ముగింపు సమావేశంలో మిషన్ భగీరథ గ్రిడ్ డీఈఈ వి.నరేందర్ మాట్లాడారు. వాటర్ ట్యాంక్‌లను శుభ్రం చేయడమే కాక చేతి పంపులు, బోర్ల మరమ్మతుపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. అనంతరం పంప్ ఆపరేటర్లకు సర్టిఫికెట్లు అందించారు. మిషన్ భగీరథ ఇంట్రా డీఈఈ ఓంప్రకాష్, గ్రిడ్ ఏఈలు గోపి, ప్రశాంత్, ఎంపీడీఓ ఎం.ఎర్రయ్య, ఎంపీఓ శివ, మెకానిక్ టి.నాగేశ్వరరావు, ఆపరేటర్లు రహిముతుల్లా, బొడ్డు ఆంజనేయులు, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు అందుకున్న ఆపరేటర్లతో డీఈఈలు

అమరుల ఆశయ సాధనకు కృషి..



నివాళులర్పిస్తున్న నాయకులు

తిరుమలాయపాలెం: ప్రజా సమస్యల పరిష్కారం కోసం అనేక పోరాటాలు నిర్వహించి ప్రాణాలు కోల్పోయిన అమరుల ఆశయ సాధనకు పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని సీపీఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను అన్నారు. సోమవారం మండలంలోని పిండిప్రోలులో సీపీఎం నాయకుడు పప్పుల భద్రయ్య రెండో వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. తెలంగాణ పోరాట యోధుడు భద్రయ్య చిన్ననాటి నుంచి చనిపోయేంతవరకు ఎత్తిన ఎర్రజెండా దించకుండా పార్టీ విస్తరణకు కృషి చేశారని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు అంగిరేకుల నర్సయ్య, పద్మనాభుల సుధాకర్, తుళ్లూరు నాగేశ్వరరావు, కాంపాటి బాబూరావు, రవి, లింగస్వామి ఉపేందర్, శ్రీను, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గౌర్‌కు సీపీఐ ఘన నివాళి

ఖమ్మంమామిళ్లగూడెం: రాజ్యసభ సభ్యుడు, ట్రేడ్ యూనియన్ నాయకుడిగా రాజబహదూర్‌గౌర్ అందించిన సేవలు మరువలేనివని సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ కొనియాడారు. రాజబహదూర్‌గౌర్ 13వ వర్ధంతి సందర్భంగా సోమవారం ఖమ్మంలోని పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పోటు ప్రసాద్ మాట్లాడుతూ.. విద్యార్థి దశలోనే వామపక్ష భావజాలాన్ని అలవర్చుకున్న గౌర్.. సాయుధ తెలంగాణ పోరాటంలో పాల్గొని జైలుకు వెళ్లారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జమ్ముల జితేందర్ రెడ్డి, ఎర్రా బాబు, ఎస్‌కే జానీమియా, సింగు నర్సింహారావు, పోటు కళావతి, తాటి వెంకటేశ్వరరావు, శివరామకృష్ణ, పగడాల మల్లేశ్, గాదె లక్ష్మీనారాయణ, నూనె శశిధర్, నాలబాల రామకృష్ణ, ఇటికాల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న పోటు ప్రసాద్ తదితరులు